## క్లుప్తంగా

### మరిడమ్మకు బంగారు, వెండి పుష్పాలతో పూజలు



బంగారు, వెండి పుష్పాలతో పూజలు అందుకుంటున్న అమ్మవారు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ అమ్మవారికి ప్రీతికరమైన శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో పూజలు చేశారు. ఉదయం అమ్మవారికి పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్య భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ విజయలక్ష్మిల ఆధ్వర్యంలో చండీహోమంతోపాటు బంగారు పుష్పాలతో పూజలు చేశారు.

### రోడ్డు ప్రమాదంలో వృద్ధ దంపతులకు గాయాలు



గాయపడిన వృద్ధ దంపతులకు సేవలు చేస్తున్న స్థానికులు

సామర్లకోట: స్థానిక కెనాల్ రోడ్డు శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధ దంపతులు త్రీవంగా గాయపడ్డారు. స్థానికుల కథనం ప్రకారం.. వేట్లపాలెం గ్రామానికి చెఁదిన పెనుమర్తి సత్తిరాజు, పాపయ్యమ్మ దంపతులు సామర్లకోట నుంచి వేట్లపాలెం మోటారు సైకిల్‌పై వెళుతూ ఉండగా హుస్సేన్‌పురం శివారులో ఎదురుగా వస్తున్న బస్సు ఢీకొంది. వృద్ధులకు గాయాలవడంతో స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి సామర్లకోట సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. కేసు నమోదు చేసి సామర్లకోట పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

### ప్రాంగణ పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్, ప్రిన్సిపాల్ తదితరులు

పెద్దాపురం: స్థానిక పట్టాభి అగ్రో ఫుడ్స్‌లో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో కిట్స్ కళాశాలకు చెందిన తొమ్మిది మంది విద్యార్థులు ప్రతిభ కనపర్చినట్టు కళాశాల చైర్మన్ బీటీసీడి శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికల్లో తొమ్మిది కళాశాలల విద్యార్థులను పాల్గొన్నట్టు తెలిపారు. ప్రతిభ కనపర్చిన విద్యార్థులను కళాశాల చైర్మన్ శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌రెడ్డి, ఈఓ జెన్ని బాబు, డీన్ సర్వారామేశ్వరుడు, ట్రైనింగ్ ఆఫీసర్ కె.శివ అభినందించారు.

### సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



కొత్త మూలపేటలో సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

కొత్తపల్లి: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిఠాపురం సిఐ జి.శ్రీనివాస్ అన్నారు. కొత్త మూలపేటలో శుక్రవారం సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మహిళల సంరక్షణ, భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణ, ఇళ్లలో చోరీల నివారణపై కూడా అవగాహన ఉండాలన్నారు. సెల్ ఫోన్ వినియోగం, సోషల్ మీడియ వంటి సాంకేతికతను సక్రమంగా వినియోగించుకోవాలి. స్మార్ట్ ఫోన్ల వినియోగం గణనీయంగా పెరగడంతో ఇటీవల సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారన్నారు ఎవరైన ఈవ్ టీజింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్సై వెంకటేష్, సిబ్బంది పాల్గొన్నారు.

### బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులకు టీషర్టుల బహూకరణ

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటి): ఈనెల 8, 9 తేదీల్లో వరంగ్ జిల్లాలో జరగనున్న ఉభయ తెలుగు రాష్ట్రాల ఓపెన్ బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్టు క్రీడాకారులకు శుక్రవారం టీషర్టులు అందజేశారు. సానా సతీస్ బాబు ఫౌండేషన్ చైర్మన్ తలాటం హరీష్ అందించిన ఈ టీషర్టులను డీఎస్ఏ క్రీడామైదానంలోని సిటీ బాల్‌బ్యాడ్మింటన్ క్లబ్ నాయకుడు దొంతమూరి అశోక్ కుమార్ పంపిణీ చేశారు.

# సమస్యల సంత

- పిఠాపురంలో పశువుల సంత దుస్థితి
- కానరాని వసతులు
- వ్యాపారులు, కొనుగోలుదారుల అవస్థలు



అభివృద్ధికి నోచుకోని పిఠాపురం పశువుల సంత

**పిఠాపురం: జిల్లాలోని పిఠాపురంలో జరిగే పశువుల** సంతకు ఎంతో ప్రాధాన్యం ఉంది. ఇక్కడ వేల స్థాయిలో పశువుల విక్రయాలు జరుగుతాయి, వందల మంది రైతులు, కొనుగోలు దారులతో కిటకిటలాడుతుంది. అయితే ఇంతటి ప్రాధాన్యం కలిగిన సంతలో సౌకర్యాలు మాత్రం అస్సలు లేవు. అమ్మకం దారులు, కొనుగోలు దారులతో పాటు సంతకు వచ్చిన పశువులకు నిలువ నీడ లేదు. తాగడానికి నీరు దొరకడం కూడా గగనమే. లక్షల రూపాయల ఆదాయం వస్తున్నా ఇక్కడ వసతులు కల్పించడంలో మున్సిపాలిటీ విఫలమైంది.

**ఎంతో ప్రత్యేకత**

పిఠాపురంలో ప్రతి శనివారం పశువుల సంత నిర్వహిస్తున్నారు. దీనికి పూర్వ కాలం నుంచి ఎంతో ప్రత్యేకత ఉంది. ఈ సంత దాదాపు వందల ఏళ్లుగా సంస్థానాధీశుల కాలం నుంచి నడుస్తున్నట్లు పెద్దలు చెబుతున్నారు. ఇక్కడ నుంచి ఎటు వైపు చూసినా 50 కిలోమీటర్లలోపు పశువుల సంతలు లేవు. దీంతో పరిసర గ్రామాల రైతులు.. పశువుల అమ్మకాలు, కొనుగోలు కోసం దీనిపైనే ఆధారపడతారు.

**శిథిలమైన షెడ్లు**

**పశువుల సంతలో గతంలో నిద్ర గన్నేరు చెట్లు ఉండేవి. వాటి కింద పశువులు సేద తీరేవి. వాటికి ఎండ నుంచి రక్షణ లభించేది. కాల క్రమేణా చెట్లు ఎండి** పోయాయి. సంతలోని పెంకుల షెడ్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో ఇక్కడకు వచ్చే వారికి ఇబ్బందులు తప్పడం లేదు. ప్రతి ఏటా దీని నుంచి మున్సిపాలిటికి రూ.లక్షల్లో ఆదాయం వస్తోంది. పశువుల క్రయవిక్రయాలకు సంబంధించిన రుసుములను ఏటా పెంచుతున్నారు. కానీ సంతలో సౌకర్యాలు కల్పించడానికి చర్యలు తీసుకోవడం లేదు. గతంతో మూడు రోజుల పాటు సంత కొనసాగేది. ప్రస్తుతం శనివారం 7 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం 2 గంటలకు పూర్తయిపోతోంది.

**నిబంధనలు తుంగలోకి..**

పశువుల తరలింపులో నిబంధనలను తుంగలో తొక్కుతున్నారు. ఒకే వాహనంలో పదుల సంఖ్యలో పశువులను కుక్కి తరలిస్తున్నారు. ప్రస్తుతం పశు గ్రాసం కొరత, వ్యాధులు పెరగడం పాడి పరిశ్రమపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. ప్రభుత్వ ప్రోత్సాహం లేకపోవడంతో పశువులను మేపలేక రైతులు వాటిని అమ్మేసుకుంటున్నారు. నియోజక వర్గ పరిధిలోని పిఠాపురం, చెందుర్తి, జల్లూరు సమీపంలోనూ కబేళాలు ఉన్నాయి. అక్కడకు ప్రతి రోజూ వందల సంఖ్యలో పశువులను తరలిస్తున్నారు.

**ఆదేశాలు బేఖాతరు**

పశువుల అక్రమ రవాణాపై నిషేధం విధిస్తూ రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను బహిరంగంగా ఇక్కడ తుంగలో తొక్కుతున్నారు. ప్రభుత్వ శాఖల అధికారులతో కమిటీ ఏర్పాటు చేసి, పశువుల అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అమలు చేశారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం దానిని పట్టించుకోవడం మానేసిందని రైతులు ఆరోపిస్తున్నారు. అడిగే వారు లేక అక్రమ వ్యాపారులు ఇష్టారాజ్యంగా మూగ జీవాలను వాహనాల్లో కుక్కి తీసుకెళుతున్నారు. కొందరు అధికారులు మామూళ్ల మత్తులో పడి వీటిని పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

**నెరవేరని పవన్ కల్యాణ్ హామీ**

పిఠాపురం పశువుల సంతను అభివృద్ధి చేస్తామంటూ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇచ్చిన హామీ మాటలకే పరిమితమైంది. ఇక్కడ కనీస సౌకర్యాలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా పట్టించుకునే నాథుడే లేడు. కేవలం ఆశీలు వసూలు చేసుకోవడానికి మాత్రమే అధికారులు వస్తున్నారు. కాగా.. నియోజకవర్గంలో అక్రమ కబేళాలు నిర్వహిస్తున్నారని, పశువులకు రక్షణ కల్పించాలని, పశువుల సంతలో సౌకర్యాలు ఏర్పాటు చేయాలని రైతులు గతంలో పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఆదేశాలపై అధికారులు తూతూమంత్రంగా తనిఖీలు నిర్వహించారు. ఎక్కడా అక్రమ కబేళాలు లేవని తేల్చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్ కనకారావును వివరణ కోరగా..పశువుల సంతలో అభివృద్ధి పనులకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

### నేటి నుంచి రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ చాంపియన్ షిప్ పోటీలు

పిఠాపురం: కొప్పన మోహనరావు, రమాదేవి స్మారక రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ చాంపియన్ షిప్ పోటీలు పిఠాపురంలో ప్రారంభమవుతున్నట్టు జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి బొజ్జా మాణిక్యాలరావు తెలిపారు. పిఠాపురం పాత బస్టాండ్ వద్ద మున్సిపల్ హైస్కూలు బాస్కెట్‌బాల్ గ్రౌండ్‌లో ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. బాస్కెట్ బాల్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, బాస్కెట్ బాల్ అసోసియేషన్ ఆఫ్ తూర్పు గోదావరి జిల్లా, పిఠాపురం బాస్కెట్‌బాల్ ప్లేయర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ పోటీలు ఈనెల 8, 9, 10, 11 తేదీల్లో నిర్వహిస్తామన్నారు.

### వైద్య ఖర్చులకు విద్యార్థికి రూ.లక్ష 'చేయూత'

కాకినాడ సిటీ: కాకినాడ జగన్నాథపురానికి చెందిన పదో తరగతి విద్యార్థి లుకేమియా వ్యాధితో బాధపడుతున్న సందర్భంగా వైద్య ఖర్చుల నిమిత్తం చేయూత సంస్థ ప్రతినిధి రవికుమార్ బృందం రూ.లక్ష అందజేశారు. ఈ చెక్కును శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ షణ్మోహన్, ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావుల సమక్షంలో విద్యార్థి తండ్రికి అందించారు. కాకినాడ జిల్లా చేయూత సంస్థ అధ్యక్షురాలు సురభీ శారద, సైన్స్ విభాగ అధ్యక్షులు వినీల్, సభ్యులు చింతా పవన్ కల్యాణ్, శ్రీమాన్, అభిరామ్ తదితరులు పాల్గొన్నారు.

# వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు ప్రారంభం



వేట్లపాలెం వేంకటేశ్వరస్వామి ఆలయంలో పసుపు దంచుతున్న మహిళలు



వేట్లపాలెంలో వేంకటేశ్వరస్వామి గ్రామోత్సవం

సామర్లకోట: వేట్లపాలెం గ్రామంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం నుంచి కల్యాణ ఉత్సవాలు ఆలయ ధర్మకర్త పెండ్యాల నాగేశ్వర రావు మాస్టారు ఆధ్వర్యంలో ప్రారంభమయ్యాయి. ప్రతి ఏడాది మాఘమాసంలో భీష్మ ఏకాదశి రోజున స్వామివారి కల్యాణం నిర్వహిస్తారు. దీనిలో భాగంగా శుక్రవారం ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవార్లను, స్వామి వారిని పెళ్లి కుమారుడు, పెళ్లి కుమార్తెలను చేశారు. ఈ మేరకు ముత్తైదువులతో పసుపు కొట్టు కార్యక్రమం నిర్వహించారు. రోకళ్లకు పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం పెద్ద శేషవాహనంపై గ్రామోత్సవం చేశారు. ఆలయం నుంచి గ్రామ పురవీధుల్లో రాత్రి వరకు ఊరేగించారు. ఆలయ కమిటీ నాయకులు వల్లూరి శేఖర్, గోలి సోమేశ్వరరావు భక్తులకు సేవలందించారు. శనివారం భీష్మ ఏకాదశి పర్వ దినాన్ని పురస్కరించుకొని గోపూజ, 108 మంది మహిళలచే లక్ష పుష్పాలతో పూజ, సాయంత్రం, చిన్న శేషవాహనంపై గ్రామోత్సవం ఉంటుందని నాగేశ్వరరావు తెలిపారు. రాత్రికి గ్రామోత్సవం ఆలయానికి చేరిన తరువాత పూజలు నిర్వహించి పారిశ్రామిక వేత్తలు మట్టే శ్రీనివాసు దంపతులు, నున్న రామకృష్ణ దంపతులతో వాడపల్లి గోపాలాచార్యులు కల్యాణం జరిపిస్తారని చెప్పారు. కాగా పీబీ దేవంలో ఉన్న వేణుగోపాలస్వామి కల్యాణం శనివారం రాత్రి జరుగుతుందని ఎంపీటీఈసీ సభ్యుడు మలకల సూరిబాబు తెలిపారు.

# శ్రీరస్తు.. శుభమస్తు.. కల్యాణమస్తు..!



కుంతీమాధవస్వామివారి తిరుమంజనం నిర్వహిస్తున్న అర్చకులు



ప్రత్యేక అలంకరణలో ఆళ్వార్లు

- పెండ్లి కుమారుడైన కుంతీమాధవుడు
- పెండ్లి కుమార్తెలుగా రాజ్యలక్ష్మీదేవి, లక్ష్మీదేవి
- నేడు స్వామివారి కల్యాణం



కల్యాణ మండపాన్ని సిద్ధం చేస్తున్న సిబ్బంది

పిఠాపురం: దేవదేవుడి కల్యాణానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పంచమాధవ క్షేత్రాలలో ఒకటైన పిఠాపురంలోని శ్రీకుంతీమాధవ స్వామి వారి దివ్య కల్యాణం శనివారం నిర్వహించనున్నారు. కల్యాణోత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కాగా ధ్వజారోహణం అనంతరం శుక్రవారం ఉదయం చక్రపెరుమాళ్ల గ్రామోత్సవం, స్వామివారి ఉత్సవ మూర్తులకు అలంకార తిరుమంజనం కల్యాణాలంకారం సాయంత్రం ప్రత్యేక పూజలు చేశారు. కుంతీ మాధవస్వామి, రాజ్యలక్ష్మి అమ్మవారు పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తె అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కల్యాణోత్సవాల్లో భాగంగా స్వామివారికి విశేష అభిషేకాలు, పూజలు చేశారు. శనివారం రాత్రి 9 గంటలకు స్వామివారి దివ్య కల్యాణం నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఆలయ ఈఓ ఎస్.శ్రీరాములు తెలిపారు. ఇదే ఆలయంలో వేంచేసియున్న లక్ష్మీదేవి అమ్మవారికి కల్యాణ అలంకరణ చేశారు. కల్యాణం ఎక్కువ మంది భక్తులు తిలకించేలా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈఓ తెలిపారు.

# ఎలుకల సామూహిక నివారణే శరణ్యం



తయారు చేసిన ఎలుకల నివారణ మందును అందజేస్తున్న జేడీ విజయకుమార్



ఎలుకల నివారణ మందును ఏ విధంగా తయారు చేయాలో వివరిస్తున్న వ్యవసాయ శాఖాధికారులు

సామర్లకోట: వరి పంట పాలు పోసుకునే దశలోనే ఎలుకలు పంటకు నష్టం కలిగిస్తాయని, దాంతో వాటి నివారణకు ప్రతి రైతు చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.విజయకుమార్ అన్నారు. సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని అచ్చంపేటలో మండల వ్యవసాయాధికారి ఐ.సత్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో శుక్రవారం ఆయన పాల్గొన్నారు. పొలాల్లోని గట్లకు బొరియలు ఏర్పాటు చేసుకొని పగలు వాటిలో ఉండి రాత్రి సమయంలో సంచరిస్తాయని తెలిపారు. వరి కంకలు కొంచెం గట్టిపడుతున్న కంకులను ఎలుకలకు చాలా ఇష్టమని పంట కోసని తరువాత పనలపై, కళ్లంలోను, గిడ్డంగుల్లో కూడా నష్టం కలిగిస్తాయని చెప్పారు. వీటి నివారణకు రైతులు అందరూ ఒకేసారి ఎలుకల నివారణకు బ్రోమోడయోలోన్ మందును ఉపయోగించాలని సూచించారు. జిల్లాలోని రైతు లు అందరూ ఒకేసారి ఈ మందుతో సామూహిక ఎలుక నివారణ చేయడంతో ఎలుకలు నివారణ సాధ్యం అవుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వీరం రెడ్డి చిన్నబాబు, రైతు సంఘ నాయకులు ఎంవీవీ రమణ, పెద్దిరెడ్డి బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

**ప్రతి రైతు సామూహిక ఎలుకల నిర్మూలన చేపట్టాలి**

పెద్దాపురం: ప్రతి రైతు సామూహిక ఎలుకల నిర్మూలన చేపట్టాలని వ్యవసాయ ఏడీఏ దైవ కుమార్, ఏఓ సంజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని ఆయా గ్రామాల ఆర్‌బీకేల వద్ద శుక్రవారం సామూహిక ఎలుకల నివారణపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎలుకలను సేద్య, యాంత్రిక జీవ పద్ధతుల ద్వారా నివారించవచ్చన్నారు. బ్రోమోడయాలిన్‌రెండు గ్రాముల మందుకు రెండు పాళ్ల నూనె, 96 గ్రాముల నూకను కలిపి ముందుగానే పొలాల్లో ఉన్న బొరియలను గమనించాలన్నారు. గుర్తించిన బొరియల్లో ఈ మందును పెట్టాలన్నారు. అనంతరం ఆయా ఆర్‌బీకేల వద్ద నూక, నూనె కలిపిన మందును రైతులు అందజేశారు. ఏఈఓ ప్రసాద్, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# మన గ్యాస్ నిక్షేపాలు మనకే చెందాలి

- 23న కాకినాడలో సదస్సు
- సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మధు



సీపీఐ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మధు

సామర్లకోట: మన రాష్ట్రంలో లభిస్తున్న గ్యాస్ నిక్షేపాలు మనకే చెందాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాటిపాక మధు అన్నారు. శుక్రవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ కాకినాడ సముద్ర తీరంలో ఏర్పడిన చమురు, గ్యాస్ నిక్షేపాలు మన రాష్ట్రానికి దక్కే విధంగా అన్ని రాజకీయ పార్టీలు పోరాటం చేయాలన్నారు. ఈ మేరకు ఈనెల 23వ తేదీన కాకినాడ గాంధీభవన్‌లో వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలతో సదస్సు ఏర్పాటు చేశామన్నారు. ఇటువంటి నిక్షేపాలు రాష్ట్రానికే కేటాయించేలా చేయడం వల్ల రాష్ట్రం అప్పుల నుంచి కొంత వరకు గట్టు ఎక్కుతుందని తెలిపారు. అదే విధంగా కృష్ణా, గోదావరి బేసిన్‌లో గ్యాస్‌తో పాటు చమురు ఉత్పత్తి విలువ కొన్ని రూ.లక్షల కోట్లలో ఉంటుందన్నారు. ఈ మేరకు దీనిలో కనీసం 50 శాతం న్యాయపరమైన లాభంలో వాటా దక్కాలని డిమాండ్ చేశారు. 23న నిర్వహించే సదస్సులో పాల్గొన్ని సదస్సును జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కె.బోడకొండ, జిల్లా నాయకులు పెదిరెడ్ల సత్యనారాయణ, మడగల రమణ, నమ్మి సత్యనారాయరణ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి అడుగువేద్దాం

**తిరుపతి ప్రముఖ పర్యావరణ వేత్త పాలేటి శివాజీ**



సమావేశంలో మాట్లాడుతున్న పాలేటి శివాజీ

పెద్దాపురం: ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ ముందడుగు వేయాలని తిరుపతి ప్రముఖ పర్యావేరణ వేత్త పాలేటి శివాజీ అన్నారు. స్థానిక శ్రీ ప్రకాష్ సినర్జీ పాఠశాలలో శుక్రవారం పర్యావరణ కలుషితంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ సీహెచ్.విజయ్‌ప్రకాష్ అధ్యక్షతన జరిగిన సదస్సులో శివాజీ మాట్లాడుతూ ప్రకృతిని మనం రక్షిస్తే అది మనల్ని రక్షిస్తుందన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలను పెంచడం వల్ల భవిష్యత్‌లో ఎంతో ప్రమాదాన్ని సృష్టిస్తుందన్నారు. ఒక్కసారి మాత్రమే ఉపయోగించే ప్లాస్టిక్, పాలిథిన్ కవర్ల వినియోగంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని శివాజీ అన్నారు. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని ఆయన కోరారు. అనంతరం పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కో-ఆర్డినేటర్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### ప్రియురాలు అన్నయ్యా అని పిలిచిందని..

కాకినాడ క్రైం: కాకినాడ జీజీహెచ్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాల్లోకి వెళితే, కాకినాడ గ్రామీణం మండలం వెలమల తూరంగికి చెందిన మడ్డు వీర వెంకట సత్యనారాయణ(24) నాలుగేళ్లుగా జీజీహెచ్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. ఓ యువతిని ప్రేమించాడు. కుటుంబాల మధ్య సయోధ్య కుదిరి పెళ్లి వరకు వెళ్లాలనుకున్నా మధ్యలో అవాంతరాలు వచ్చాయి. ఈ నేపథ్యంలో సత్యనారాయణ సోదరి సీమంతం వేడుకకు అతని ప్రియురాలు వచ్చింది. ఆ సమయంలో అన్నయ్యా అని పిలవడంతో మనస్తాపానికి గురయ్యాడని ఓ ఆడియో రికార్డింగ్ ద్వారా వెల్లడైంది. ఈ నేపథ్యంలో పురుగుల మందు స్వల్పంగా మద్యంలో కలుపుకొని సేవించాడు. నాటి నుంచి వివిధ ఆరోగ్య సమస్యలకు గురయ్యాడు. ఆదివారం ఆరోగ్యం విషమించడంతో కుటుంబీకులు కాకినాడ జీజీహెచ్‌లో చేర్చగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఘటనపై ఇంద్రపాలెం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది.

# ఫిల్టర్ బెడ్ చెరువు పరిశీలన



సామర్లకోట ఫిల్టర్ బెడ్‌ను పరిశీలించిన తిరుపతి పరిశోధన కేంద్రం ప్రొఫెసర్, మున్సిపల్ కమిషనర్ తదితరులు

సామర్లకోట: స్థానిక ఉండూరు రైల్వే గేటు వద్ద ఉన్న ఫిల్టర్ బెడ్‌కు చెందిన చెరువును తిరుపతి పరిశోధన కేంద్రం ప్రొఫెసర్ పుట్టంరెడ్డి శివసాయి పరిశీలించారు. ఫిల్టరు చెరువులో నీరు నాచు రంగులో ఉండడంతో దానిని ఫిల్టరు చేయడం సాధ్యం కాదని ఇంజినీరింగ్ శాఖ అధికారులు చేతులెత్తేశారు. ఇటీవల విశాఖపట్నం ల్యాబ్‌కు ఫిల్టరు చెరువులోని నీటిని పంపడంతో నీరు తాగడానికి ఎటువంటి అభ్యంతరాలు లేవని సర్టిఫికెట్ ఇచ్చారు. దానికి తృప్తి చెందిన ఇంజినీరింగ్ శాఖ అధికారులు తిరుపతి పరిశోధనాధికారులతో చర్చించడం శివసాయి శుక్రవారం సాయంత్రం సామర్లకోట వచ్చారు. ఈ మేరకు చెరువులో నీటిని, ఫిల్టర్ బెడ్‌ను, ఐదు తూముల వద్ద నుంచి బైపాస్ కాలువను ఆమె పరిశీలించారు. గోదావరి కాలువలో నీరు ఉన్నా విడుదల చేయకపోవడానికి కారణాలు అడిగి తెలుసుకున్నారు. గోదావరి కాలువ నుంచి లాకుల వద్ద ఉన్న చానల్ గేట్ల ద్వారా బైపాస్ కాలువకు నీరు వస్తుందని, ఇరిగేషన్ అధికారులు దానిని పూర్తిగా మూసి వేశారన్నారు. ఈ మేరకు నాగార్జున ఫిల్టరు చెరువులో నీటిని నాలుగు ప్రదేశాలల్లో ఎనిమిది బాటిల్స్ శ్యాంపిల్స్ సేకరించారు. వీటిని తిరుపతి ల్యాబ్‌కు పరిశోధన చేసి విషయం తెలియజేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య, డీఈ కె.శశిధర్, ఏఈ రమేష్, ఫిల్టర్ బెడ్ ఇన్‌చార్జి గిడుతూరి శ్రీనివాసులు పాల్గొన్నారు. కాగా గతంలో ఇటువంటి పరిస్థితి ఏర్పడితే వైఎస్సార్ సీపీ నాయకులు దవులూరి సుబ్బారావు, గంగిరెడ్డి కృష్ణమూర్తి(చైర్‌పర్సన్ భర్త) వైస్‌చైర్మన్ ఉబా జాన్‌మోజెస్‌లు దగ్గర ఉండి బైపాస్ కాలువలోనికి నీరు వచ్చేలా గేట్లు మున్సిపల్ సిబ్బందితో ఎత్తించారు. అడ్డు వచ్చిన ఇరిగేషన్ అధికారులకు తాగునీటి సమస్యను అడ్డుకోవడం సరి కాదని హెచ్చరించడంతో ఇరిగేషన్ అధికారులు వెనుతిరిగిన విషయం విధితమే. తాగునీటి సమస్య ఏర్పడుతున్న ప్రస్తుతం మౌనంగా ఉండటంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

# డిజిటల్ అరెస్టు నుంచి రక్షించిన 'చైతన్యం'

**భారీ మోసం నుంచి త్రుటిలో తప్పించుకున్న విశ్రాంత ఉద్యోగి**



సీఐ అప్పలనాయుడుకి ఫిర్యాదు చేస్తున్న విశ్వనాథం

కాకినాడ క్రైం: డిజిటల్ అరెస్టు స్కాం తొలిసారి జిల్లాను తాకింది. కాకినాడకు చెందిన ఓ విశ్రాంత ఉద్యోగికి సైబర్ నేరాగాళ్ల నుంచి డిజిటల్ అరెస్ట్ చేస్తున్నామంటూ ఓ ఫేక్ వీడియో కాల్ వచ్చింది. ఈ వ్యవహారంపై ఆయన పోలీసుల్ని ఆశ్రయించారు. సైబర్ నేరాలపై పోలీసులు చేపడుతున్న అవగాహనతో ఓ విశ్రాంత ఉద్యోగి తన ఖాతాలోని భారీ మొత్తాన్ని కాపాడుకున్నాడు. వివరాల్లోకి వెళితే, కాకినాడ ప్రతాప్ నగర్‌కు చెందిన 70 ఏళ్ల ఎం.విశ్వనాథం ఓ విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగి ఆయన ఖాతాలో నగదు మొత్తంపై సైబర్ నేరగాళ్ల కన్ను పడింది. బుధవారం ఓ వీడియో కాల్ చేసి మీరు డిజిటల్ అరెస్ట్ అయ్యారంటూ బెదిరించారు. ఈ అరెస్టు, తదనంతర పరిణామాల నుంచి బయటపడాలంటే తమకు డబ్బు చెల్లించాలంటూ గాలం వేశారు. ఆదిలో కంగారు పడిన విశ్వనాథం అంతలోనే తేరుకుని గతంలో ఈ విషయమై పొందిన అవగాహనతో విశ్వనాథం తిరగబడి ప్రశ్నించి, హెచ్చరించారు. దీంతో బెంబేలెత్తిన సైబర్ మోసగాడు సెల్ ఫోన్ తెర నుంచి చటుక్కున మాయమయ్యాడు. అనంతరం కుటుంబ సభ్యులతో చర్చించి వారి సూచన మేరకు టూ టౌన్ సీఐ అప్పలనాయుడిని కలసి సైబర్ కాల్‌పై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పోలీసుల మార్గనిర్దేశంలో చేపడుతున్న సైబర్ నేరాలపై అవగాహన సదస్సులు సత్ఫలితాలనివ్వడం సంతోషాన్నిచ్చిందన్నారు. సైబర్ నేరాలకు గురైన వారు 1930, 112 టోల్ ఫ్రీ నంబర్లలో ఫిర్యాదు చేయాలని, లేదా స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించాలన్నారు. ఈ ఘటనపై స్పందించిన ఎస్పీ బిందుమాధవ్ సైబర్ నేరగాళ్లను ఎదుర్కొన్న విశ్వనాథంతో పాటు అవగాహన సదస్సుల ద్వారా ఆ మనోధైర్యాన్నిచ్చిన సీఐ అప్పలనాయుడిని అభినందించారు.